క్లుప్తంగా

42 మందికి నేత్ర వైద్య పరీక్షలు



చల్లపల్లి: చల్లపల్లి వీఆర్‌కే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక క్లబ్ కార్యాలయంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. గూడూరు చెందిన సాయి నేత్రాలయం డాక్టర్ వెంకట్రావ్ నేతృత్వంలో 42 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందిని శుక్లాల ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. చల్లపల్లి సుజలాం వాటర్ ప్లాంట్ నిర్వాహకులు డి.భాస్కరరావు ఈ వైద్య శిబిరానికి ఆర్థిక సహాయం అందించగా, క్లబ్ జిల్లా నాయకులు నర్రా సాయిబాబు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపాటి రాధాకృష్ణ, ప్రతినిధులు ఎంవీ కృష్ణారావు పర్యవేక్షించారు.

భక్తిప్రపత్తులతో రుద్రాభిషేకాలు



కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఉత్సవామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిపారు. అనంతరం మూలమూర్తికి పంచామృతాభిషేకం చేసి బిల్వ పత్రాలతో అర్చన నిర్వహించారు. హోమక్రతువును కనులపండువగా జరిపారు. రాత్రికి స్వామివార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఏర్పాట్లను ఈఓ సుధాకర్ పర్యవేక్షించారు.

నమోస్తుతే.. వాసవీ కన్యకాపరమేశ్వరి..!!



కోడూరులో అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న ఆర్యవైశ్య మహిళలు

- కనులపండువగా అమ్మవారి జయంతి
- ప్రత్యేక పూజలు చేసిన ఆర్యవైశ్యులు

కోడూరు: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కోడూరులోని దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య ప్రముఖుడు దేసు మల్లిఖార్జునరావు–నాగలక్ష్మి గృహం నుంచి అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ, గాజులు, సారెను మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై ఊరేగించి, స్థానిక శివరామకృష్ణ క్షేత్రంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి సారెను సమర్పించి, లలిత సహస్రనామ పారాయణాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలను కూడా చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు బూరగడ్డ హరినాథ్‌బాబు, మద్దాలి ప్రసాద్, అద్దేపల్లి సత్యనారాయణ, అన్నం శ్రీనివాస్, యిమ్మడి రాంబాబు, అన్నం శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవం

నాగాయలంక: స్థానిక శ్రీ పార్వతీ సమేత శ్రీ కన్యకా పరమేశ్వరి సమన్విత శ్రీ నగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం కన్యకాంబ 4,641వ జయంత్యుత్సవం వైభవోపేతంగా జరిపారు. గణపతి సచ్చిదానంద స్వామీజి, కే భానుప్రసాద్ దివ్యమంగళ ఆశీస్సులతో ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు నేతృత్వంలో 108 లీటర్ల ఆవు పాలతో కన్యకాంబ మూలవిరాట్, ఉత్సవమూర్తులకు అర్చకుడు కొల్లిపర సుబ్బారావు ఆధ్వర్యంలో పంచామృతం, పసుపు, కుంకుమ, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేయగా, ఉత్సవమూర్తికి ఆర్యవైశ్యులు, గ్రామస్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా సహస్రనామ కుంకుమార్చన, సంకర్షణ భజన మండలి సభ్యులు ఆధ్వర్యంలో సామూహికంగా వాసవీమాత నామ పారాయణం చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు చిట్టా వెంకట పూర్ణచంద్రరావు, చిట్టా శివనాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, ఆకుతోట సీతారామయ్య, చిట్టా వీర అన్నపూర్ణయ్య, దేసు సత్యనారాయణ, చిట్టా హరేకృష్ణ, కమిటీ సభ్యులు, శ్రీవాసవీ సేవాదళ్ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం విశేష పూజలు చేశారు. రజతాలంకరణ, సహస్ర కుంకుమార్చన, లక్ష మల్లెల అర్చన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు మామిళ్ళపల్లి శివరామకృష్ణ ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కృష్ణా నదీవిహారం..

నాగాయలంక: మండల ఆర్యవైశ్యసంఘాలు, శ్రీవాసవీ సేవాదళ్, శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో కన్యకా పరమేశ్వరీదేవి తెప్పోత్సవం శనివారం రాత్రి కనులపండువగా సాగింది. ప్రత్యేకంగా అంకరించిన హంస వాహనంపై విద్యుత్ దీప కాంతుల నడుమ అమ్మవారు కృష్ణానదిలో విహారం చేశారు. శ్రీ వాసవీ సేవాదళ్ నిర్వహణలో సాయంత్రం 5గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో పల్లకిలో కృష్ణానది వరకు ఊరేగింపు 7.30 గంటలకు పవిత్ర కృష్ణానదిలో అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 102 మంది మహిళలచే కృష్ణానదిలో విహారం చేసిన అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా దీపాల హారతి ఇచ్చారు. అనంతరం దేవాలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చి ఆలయంలో అమ్మవారికి సామూహిక దీప సమర్పణ, కేక్ కటింగ్ కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక శోభను చేకూర్చారు. కృష్ణానదిలో పడవ వాహనం వద్ద సుబ్బారావు బ్రహ్మత్వంలో చిట్టా శివనాగేశ్వరరావు, రాజేశ్వరి దంపతులు తెప్పోత్సవ పూజలు చేశారు.

పెడన: పట్టణంలో శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవీ మాత జయంతి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు జరిగే ఈ మహోత్సవాలను శనివారం ఉదయం సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయ (చిన్నా) పర్యవేక్షణలో అత్యంత భక్తిశ్రద్ధలతో మొదలయ్యాయి. శనివారం ఉదయం గణపతి పూజ, గోపూజ శ్రీవాసవి మాతకు 18 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి హోమం నిర్వహించారు. తమ్మన లలిత శంకర్, అన్నపూర్ణ దంపతులచే ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు పూజాది కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. పట్టణ శ్రీ వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో వందమంది మహిళలు శ్రీ వాసవీ మాతకు పిండి జ్యోతులతో హారతులు ఇచ్చారు. ఈ వాసవీ మాత ఉత్సవ విగ్రహాన్ని ఉయ్యాలలో ఉంచి ఊంజల్ సేవ నిర్వహించి భక్తి పాటలను ఆలపించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు తమ్మన వెంకట సుబ్బారావు కుమారులు తమ్మన లీలా వెంకట శివరాం ప్రసాద్, తమ్మన లలితాశంకర్ ఉభయ దాతలుగా ఉన్నారు. అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వాసవీ మాతను దర్శించుకున్న భక్తులకు పట్టణ ఆర్యవైశ్య సంఘం వారు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



కోడూరులో అమ్మవారిని ఊరేగిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు



అభిషేకాలు చేస్తున్న చైర్మన్ సాంబశివరావు, ఆర్యవైశ్యులు, గ్రామస్తులు



తెప్పోత్సవ పూజలు చేసిన చిట్టా దంపతులు



నదీవిహారంలో కన్యకాంబకు సామూహిక దీపాలంకరణ హారతులు సమర్పించిన మహిళలు



వాసవీ మాతకు అభిషేకాలు చేసేందుకు 18రకాల ద్రవ్యాలను తీసుకువచ్చిన భక్తులు



శ్రీరామపాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలో వాసవీమాత తెప్పోత్సవం

నాంచారమ్మ జాతరకు ఏర్పాట్లు సిద్ధం

- నేటి నుంచి అమ్మవారి గ్రామోత్సవం
- 23న అమ్మవారి ప్రధాన గుడిసంబరం



అద్దంకి నాంచారమ్మ అమ్మవారు

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మందపాకల అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం నుంచి అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గాదె కృష్ణబాబు శనివారం తెలిపారు. ఉదయం గణపతి పూజ, ఆఖండ దీపారధ అనంతరం నాంచారమ్మ చిన్నఅమ్మవారి గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాత్రికి యల్లారమ్మ అమ్మవారి జాతరను నిర్వహించనున్నట్లు కృష్ణబాబు తెలిపారు. 20న మందపాకల, పాదాలవారిపాలెం గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు, ఘటం ముద్రించు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 21న ముత్యాలమ్మ అమ్మవారి జాతర, 22న అమ్మగారి తల్లి, అంకాలమ్మ అమ్మవారి జాతర ఉంటుందన్నారు. 23న ఉదయం పోతురాజు స్వామివారి జాతర, రాత్రికి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన గుడి జాతరను నిర్వహించనున్నట్లు కృష్ణబాబు చెప్పారు. జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి భారీ విద్యుత్ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో జాతర ప్రారంభం

అన్నవరం(మోపిదేవి): మండల పరిధిలోని వెంకటాపురం శివారు అన్నవరం–చిర్లపాలెం గ్రామంలో శ్రీ మారెమ్మ తల్లి జాతర ప్రారంభించారు. ప్రతి ఐదు సంవత్సరాల ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాలు 20వ తేదీ వరకు భక్తి శ్రద్ధలతో ప్రారంభించినట్టు శనివారం ఆలయ కమిటీ తెలిపింది. తొలిరోజు శ్రీ గంగానమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. రెండోరోజు శనివారం పోతురాజు తండ్రికి చలిమిడి, వడపప్పు సమర్పించడంతో పాటు మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం నుంచి శ్రీ మద్దెలమ్మ, మదరజాయిబ్ జాతర నిర్వహిస్తామని, సాయంత్రం శ్రీ మారెమ్మ, శ్రీముత్యాలమ్మ అమ్మవార్ల జాతర వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం రాత్రి పోతురాజు తండ్రి గెడ ఊరేగింపు ఇంటింటా నిర్వహిస్తామని చెప్పారు. సోమవారం నిర్వహించే వనవలమ్మ జాతర మహోత్సవంతో కార్యక్రమాలు ముగిస్తామని కమిటీ సభ్యులు వివరించారు. బంధుమిత్రులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయనాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



పోతురాజు తండ్రికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

21 నుంచి శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణం

శ్రీకాకుళం(ఘంటసాల): ఈ నెల 21 నుంచి ఆంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎస్.ఎస్.చక్రధరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ తేదీన స్వామి వారిని పెండ్లి కుమారుని చేయుట, హనుమంత వాహనంపై గ్రామోత్సవం, 22న రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, రాత్రి ఒంటి గంటకు గరుడ వాహనంపై శ్రీ భూసమేత శ్రీ కాకుళేశ్వరస్వామి వారి గ్రామోత్సవం, 23న రాత్రి 7గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం, 24న సాయంత్రం 5గంటలకు శ్రీస్వామి వార్ల చూర్ణోత్సవం, వసంతోత్సవం అనంతరం గ్రామోత్సవం అశ్వావాహనంపై ఊరేగింపు, ధ్వజ అవరోహణం, 25న రాత్రి 7గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగోత్సవం, పవళింపు సేవతో స్వామి వార్ల కల్యాణ బ్రహోత్సవాలు ముగుస్తాయని ఆలయ సహాయ కమిషనర్ ఎస్.ఎస్.చక్రధరరావు కోరారు.



శ్రీకాకుళంలో శ్రీకాకుళేశ్వర స్వామి వారు

చౌడును తట్టుకునే వరి వంగడాలు సిద్ధం

మచిలీపట్నం వరిపరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ గిరిజారాణి

అవనిగడ్డ: చౌడుని తట్టుకుని మంచి దిగుబడులు ఇచ్చే వరి విత్తనాలు మచిలీపట్నం, పెడన రోడ్డు పంటకాలువ పక్కన వరిపరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్త డాక్టర్ గిరిజారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తీర ప్రాంతంలో చౌడు భూములు ఉన్న రైతులు, సాధారణ రైతులు కూడా సన్న రకం వరి వంగడాలను సాగు చేసుకోవచ్చని చెప్పారు.

ఎంసీయూ 100 రకం

ఈ రకం వరి వంగడం పంట కాల వ్యవధి 145 రోజులు. చౌడుని సమర్థవంతంగా తట్టుకుంటుంది. దోమ పోటుని తట్టుకుంటుంది. గింజరాలదు. పైరు పడిపోదు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉంటుంది. 7.5 టన్నుల దిగుబడి వస్తుంది.

ఎంసీయూ 103 రకం..

చౌడుని తట్టుకోవడంతో పాటు అగ్గి తెగులు, తెల్లదోమను తట్టుకుంటుంది. బాగా సన్నరకం. అన్నానికి బాగుంటుంది. గింజ రాలదు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉంటుంది. పొలం పడిపోకుండా తట్టుకుని నిలబడుతుంది. 7.3 టన్నుల దిగుబడి వస్తుంది.

ఎంసీయూ 125 రకం..

చౌడును సమర్థవంతంగా తట్టుకునే రకం. పంట కాల వ్యవధి 125 రోజులు. ఎండాకు, దోమపోటుని తట్టుకుంటుంది. పైరు పడిపోదు. 7.5 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు పెడన రోడ్డులోని మచిలీపట్నం వరి పరిశోధనా స్థానంలో సంప్రదించాలని శాస్త్రవేత్త గిరిజారాణి సూచించారు.

కోడూరు నుంచి కాలినడకన తిరుమలకు..

కోడూరు: శ్రీవేంకటేశ్వరుడిని దర్శించుకొనేందుకు కోడూరు నుంచి ఓ భక్తుడు కాలినడకన తిరుమలకు బయలుదేరాడు. కోడూరుకు చెందిన చేబోయిన శ్రీనివాస్ తిరుమలకు నడిచి వస్తానంటూ గతంలో స్వామివారికి మొక్కుకున్నాడు. దీంతో మొక్కును తీర్చేందుకు శ్రీనివాస్ శనివారం ఉదయం స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పూజలు చేసి తిరుమలకు కాలినడక పయనమయ్యాడు. సుమారు 400 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి స్వామివారిని దర్శించుకోనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఆరు పదుల వయస్సులో కూడా శ్రీనివాస్ కాలినడకన తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకొనేందుకు పయనమయ్యాడు. దీంతో పాంచజన్య గీతా పారాయణ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌ను సత్కరించారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పాంచజన్య గీతాపారాయణ కమిటీ సభ్యులు

మూడో రోజూ ప్రశాంతంగా ఈఏపీసెట్

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఈఏపీసెట్ ఇంజినీరింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు జరిగిన ఈ పరీక్షలకు 192 మందికి 184 మంది హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం.. మామిడి తోటలకు నష్టం



కొడాలి ప్రధాన రహదారిపైకి చేరిన వర్షపు నీరు



అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాల వద్ద కురుస్తున్న వర్షం

అవనిగడ్డ: అవనిగడ్డ మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం కుండపోత వర్షం కురిసింది. అరగంట అరగంటకు మధ్య విరామం ఇస్తూ రోజంతా పడిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచింది. మెట్ట ప్రాంతాల్లో సాగుచేస్తున్న కూరగాయల పంటలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. మామిడి తోటలకు నష్టం చేకూర్చింది. వర్షం ఈదురు గాలులకు పలుచోట్ల మామిడి కాయలు రాలిపోయాయి. మామిడి కాయలు తయారు అవుతున్న ఈ సమయంలో వర్షం పడితే ఈగ, పురుగు పట్టి పుచ్చులు వస్తాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు రోజుల వరకూ మండిన ఎండలకు బెంబేలెత్తిన ప్రజలు వర్షాల వల్ల వాతావరణం చల్లబడటంతో ఊరట చెందారు.

ఘంటసాల: వాతావరణం మార్పులతో ఘంటసాల మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఘంటసాలలో కురిసిన 7.8 సెం.మీ. వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా శుక్రవారం ఘంటసాల మండలంలో 31.6సెం.మీ.వర్షపాతం నమోదైంది.

మోపిదేవి: మండలంలో వర్షపాతం 20 మీ.మీ వర్షపాతం నమోదయిందని శనివారం తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. ఉదయం నుంచే వాతావరణంలో కారు మబ్బులు కమ్మి వర్షం కురవడంతో ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం కొంచెంసేపు కురుస్తూ..మళ్లీ తెరపి ఇస్తూ..మళ్లీ కురుస్తూనే ఉంది.

నేటి నుంచి మాధవ స్వామి బ్రహ్మోత్సవాలు

గూడూరు: శ్రీదేవి భూదేవి సమేత మాధవ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమవుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ తెలిపారు. ఆదివారం ఉదయం దేవతామూర్తులను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా అలంకరించనున్నారు. సోమవారం రెండో రోజు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారు. మంగళవారం జగజ్యోతి, శేష వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుంది. బుధవారం కలపటపు కృష్ణారావు రుక్మిణమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తారు. అనంతరం అశ్వవాహనంపై స్వామి వారి ఊరేగింపు, ఎదుర్కోల ఉత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 8.30 గంటలకు స్వామి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. గురువారం గరుడ సేవ ఊరేగింపు, పుష్పయాగం, అష్టాక్షరీ మంత్ర హోమం తదనంతరం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు. చివరి రోజైన శుక్రవారం స్వామ వారి పవళింపు సేవ ఉంటుందని నిర్వహకులు తెలిపారు.

22న శాంతి కల్యాణోత్సవం

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ శ్యామలాంబ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22న స్వామి వారి శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో టీవీవీ మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు జరిగే ఈ కల్యాణోత్సవాన్ని కొనసం నాగచైతన్య, చంద్రరేఖ దంపతులచే జరుపబడునని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

పడవల రేవు వరకు రోడ్డు నిర్మిస్తాం



సత్తెమ్మ తల్లి శిలలను సందర్శించిన ట్రస్ట్ చైర్మన్ విక్కుర్తి

సొర్లగొంది(నాగాయలంక): అవనిగడ్డకు చెందిన విక్కుర్తి రాఘవయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామం నుంచి పడవల రేవు వద్దకు రహదారి, సత్తెమ్మ తల్లికి మండపం నిర్మాణం చేపడతామని ట్రస్ట్ చైర్మన్ విక్కుర్తి శ్రీనివాసరావు ప్రకటించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు శనివారం ఆయన గ్రామంలో పర్యటించిన సందర్భంగా మత్స్యకారులు ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించి హామీ ఇచ్చారు. జీవనాధారమైన చేపలవేటకు అవసరమైన మార్గంలో ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నందున రోడ్డుగా నిర్మించాలని, సముద్ర పాయల (సింక్‌లు)నడుమ వెలసిన శిలారూప సత్తెమ్మతల్లికి షెడ్డు నిర్మించాలని కోరడంతో ఆయన అంగీకరించారు.

వృత్తివిద్యల్లో శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నంటౌన్: నగరంలోని డాక్టర్ పట్టాభి మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థలో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ గోపీనాథ్ శనివారం తెలిపారు. పుట్టగొడుగుల పెంపకం, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కంప్యూటర్ ఎకౌంటింగ్, ట్యాలీ, జ్యూట్–రెగ్జిన్ బ్యాగ్‌ల తయారీ, హౌస్ ఎలక్ట్రికల్ వైరింగ్ వంటి కోర్సుల్లో జిల్లాలోని యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే వారు పాత రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న తమ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు ఫారాలు తీసుకుని అందజేయాలన్నారు. వివరాలకు 93907 74782, 81211 84183 నంబర్లలో సంప్రదించాలన్నారు.